క్లుప్తంగా

సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రహీమ్

మునగపాక: వివాదాలకు **తావు లేకుండా** గ్రామాల్లో సమస్యలు పరి**ష్కరించుకోవాలని** మండల ప్రత్యేకాధికారి **రహీమ్ కోరారు.** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఎంఎల్‌సీసీ కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల నుంచి వచ్చిన అర్జీలకు సంబంధించి ఇరువర్గాలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి గొడవలకు దిగకుండా సాధ్యమైనంతలో సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవాలన్నారు. అల్లర్లకు పాల్పడకుండా సంయమనం పాటించాలన్నారు. తహసీల్దార్ పి.సత్యనారాయణ, ఎంపీడీవో ఎం.ఉషారాణి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పిల్లల ఎదుగులకు టీకాలు దోహదం



పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో శనివారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ యామిని ప్రియాంక మాట్లాడుతూ ప్రతీ తల్లి తమ పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. పిల్లల ఎదుగుదలకు టీకాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు సందర్శించి పిల్లల ఆరోగ్యం పట్ల తల్లులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం భారతి, సూరప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బయో ఫెర్టిలైజర్లతో ఉపయోగాలెన్నో..



యండపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సరోజిని

కోటవురట్ల: బయో ఫెర్టిలైజర్లు వినియోగించడం ద్వారా తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన పంట సాధ్యపడుతుందని, తద్వారా మంచి దిగుబడి వస్తుందని ఏవో బి.సరోజిని తెలిపారు. మండలంలోని యండపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు క్షేత్రస్థాయిలో బయో ఫెర్టిలైజర్లపై అవగాహన కల్పించారు. ఎకరా వరి చేనుకు 200 లీటర్ల నీటిలో 500 ఎంఎల్ నానో యూరియా కలిపి పిచికారీ చేస్తే వాతావరణ ముప్పు నుంచి తప్పించుకోవడమే కాకుండా తెగుళ్లు ఆశించవని తెలిపారు. సాగులో ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ యంత్రాలను వినియోగించాలని సూచించారు. దీని వల్ల తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు సాధ్యపడతాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో మధు, వ్యవసాయ సహాయకులు గంగబాబు, త్రినాథ్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

గొల్లలపాలెంలో ఫీవర్ సర్వే



చినగొల్లలపాలెంలో ఇంటింటి సర్వే చేస్తున్న ఆశాకార్యకర్తలు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి చినగొల్లలపాలెంలో వైద్య ఆరోగ్య సిబ్బంది శనివారం ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టారు. గ్రామంలో 15 ఇళ్లు ఉండగా, ఆశా కార్యకర్తలు జోగా వెంకటలక్ష్మి, కే భవానీ, ఎం కుసుమకుమారి, ఏ బుజ్జి, ఎన్ సరోజిని రెండు బృందాలుగా ఇంటింటినీ జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి సత్యనారాయణ, కమిషనర్ ప్రసాదరాజు, పారిశుధ్య సిబ్బంది కొన్ని ఇళ్లకు వెళ్లి జ్వరపీడితులు ఎంత సంఖ్య ఉందో అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వేలో ముగ్గురికి మాత్రమే జ్వరం ఉన్నట్టు గుర్తించారు. గ్రామంలో వంద మందికి జ్వరాలు వచ్చాయని, వారంతా శుక్రవారం యలమంచిలి సీహెచ్‌సీకి క్యూ కట్టారని పత్రికల్లో రాయడం అవాస్తవమని అధికారులు నిర్ధారించుకున్నారు. చినగొల్లలపాలెం రామాలయంలో ఈ నెల 2, 4, 6 తేదీల్లో వైద్య శిబిరం నిర్వహించగా, ముగ్గురు జ్వరబాధితులు ఉన్నట్టు నిర్ధారించుకున్నామని ఏఎన్‌ఎం ఏ ప్రమీల తెలిపారు. అదేవిధంగా యలమంచిలి సీహెచ్‌సీకి శుక్రవారం చినగొల్లలపాలెం నుంచి వంద మంది జ్వర బాధితులు రాలేదని వైద్యాధికారి నిహారిక తెలిపారు. అన్ని గ్రామాల నుంచి 12 మంది మాత్రమే వచ్చినట్టు ఓపీ రిజిస్టర్‌లో నమోదైందన్నారు. రెండు నెలలతో పోల్చితే ప్రస్తుతం జ్వర బాధితుల సంఖ్య తగ్గిందని పేర్కొన్నారు.

చిరు వ్యాపారులకు నీడ కరువు

- పెదగుమ్ములూరులో మార్కెట్ ఏర్పాటుకు స్థలం కేటాయింపు
- ఏళ్లు గడుస్తున్నా భవన నిర్మాణాల ఊసే లేదు
- ఎండ, వానా కాలంలో విక్రయదారుల ఇబ్బందులు
- ఆశీలు వసూలు చేస్తున్న పాలకవర్గంపై ఆగ్రహం



అడ్డురోడ్డు జంక్షన్‌లో రోడ్డుపై వర్షంతో గొడుగుల కింద అమ్ముకుంటున్న చిరువ్యాపారులు

ఎస్.రాయవరం: వాణిజ్య కేంద్రం అడ్డురోడ్డులో చిరువ్యాపారులకు నిలువ నీడలేక నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై వర్షంలో తడుస్తూ.. ఎండలో ఎండుతూ విక్రయాలు చేస్తున్నారు. మూడు మండలాలకు ముఖ్య కూడలైన అడ్డురోడ్డుకు రైతులు కూరగాయలు, పండ్లు తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. వీరంతా రోడ్డుకు ఇరువైపులా అమ్మకాలు చేస్తున్నారు. దాంతో కొన్ని సందర్భాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. జంక్షన్‌కు ఎక్కువగా కోటవురట్ల మండలం జల్లూరు, జంగాలపల్లి, రామచంద్రపురం, కైలాసపట్నం, ఎస్.రాయవరం మండలం పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, దార్లపూడి, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు, గోకులపాడు, గెడ్డపాలెం, గుర్రాజుపేట, నక్కపల్లి మండలం సీహెచ్‌ఎల్ పురం, జానకయ్యపేట, బోదిగల్లం తదితర గ్రామాల నుంచి కూరగాయలు, పండ్లు, తదితర ఇతర వస్తువులు తెచ్చుకుని అమ్మకాలు సాగిస్తుంటారు. అదేక్రమంలో తిమ్మాపురం సచివాలయం వద్ద చేపల మార్కెట్‌లోనూ నీడలేక గంపలతో చేపలు అమ్మకాలు సాగించే మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. వీరి సమస్యలు దృష్టిలో ఉంచుకుని పాలకులు, స్థానిక పంచాయతీ వారు మార్కెట్ భవనాలు నిర్మిస్తామని చెప్పడమేగానీ ఆచరణ చూపడం లేదని వాపోతున్నారు.

మార్కెట్‌కు స్థలం కేటాయింపుతో సరి..

రెండు గ్రామ పంచాయతీల నడుమ తిమ్మాపురం, పెదగుమ్ములూరు పంచాయతీల మధ్య అడ్డురోడ్డు వాణిజ్య కేంద్రంలో చిరువ్యాపారులకు సౌకర్యార్థం నీడ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. చేపల మార్కెట్‌కు ప్రత్యేక సదుపాయం ఏర్పాటు చేసి వ్యాపారాభివృద్ధికి సహకరించాలని వారు కోరుతున్నారు. గత ప్రభుత్వాల్లో పెదగుమ్ములూరు పంచాయతీలో సర్కిల్ కార్యాలయానికి ఆనుకుని పది సెంట్లు స్థలం, తిమ్మాపురం సచివాలయానికి ఆనుకుని ఇరవై సెంట్లు స్థలం చిరువ్యాపారుల విక్రయాలు చేసుకునేందుకు కేటాయించారు. మార్కెట్ కమిటీ, మత్స్యశాఖ నుంచి నిధులు కేటాయింపులు జరిగినట్టు చెప్పారు. ఆ నిధులతో పనులు చేపట్టక వ్యాపారులకు కష్టాలు తప్పలేదు. ప్రస్తుతం ఈ సెంటర్, తాగునీరు, మరుగుదొడ్డి వంటి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయలేదు. రెండు పంచాయతీల నుంచి విడివిడిగా ఆశీల వసూళ్లు మాత్రం చేపడుతూ ఉన్నారు. ప్రభుత్వ అధికారులు స్థానిక పాలకవర్గాల వారు వీరికి కనీస సదుపాయాలతోపాటు, నిధులు కేటాయించి మార్కెట్ భవనాలు నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆశీలు దండుకుంటున్నారు



ప్రస్తుతం తిమ్మాపురం పంచాయతీ స్థలంలో అమ్ముతున్నాం. నాలుగేళ్ల క్రితం వరకు పెదగుమ్ములూరు పంచాయతీ స్థలంలో అమ్ముకునేవారం. ఈ ప్రాంతంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తామని ఖాళీ ప్రదేశం చూపించారు. ఇంతవరకు పనులు చేయలేదు. పంచాయతీల వారు మాత్రం ఆశీలు దండుకుంటున్నారు. కనీసం తాగునీరు, మరుగుదొడ్డి లేదు.

– వాసుపల్లి సోమేరమ్మ, చేపలవ్యాపారి, బంగారమ్మపాలెం, ఎస్.రాయవరం మండలం

ఎండలో రోడ్డుపై అమ్ముకుంటున్నాం



అడ్డురోడ్డుకు కూరగాయలు తెచ్చుకుని అమ్ముకుంటున్నాం. ఇక్కడ మార్కెట్ లేక రోడ్డు మీద వేసుకుని అమ్ముతున్నాం. వర్షం వస్తే సరకులతో పాటు మేము తడవాల్సిందే. ఎండకాసి నీడ కోసం చూసుకుని దుకాణం వేసుకోవాల్సిందే.

– రమణమ్మ, మహిళా రైతు, జంగాలపల్లి, కోటవురట్ల మండలం



వర్షంలో తడుస్తూ కూరగాయలు సర్దుకుంటున్న మహిళ



తాత్కాలిక షెడ్డులో మరో దుకాణం



పెదగుమ్ములూరులో మార్కెట్ నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వం స్థలంలో పిచ్చిమొక్కలు

ఉపకరణాలకు దివ్యాంగుల గుర్తింపు శిబిరం

నక్కపల్లి: పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష అభియాన్, అలింకో సంస్థ సంయుక్తంగా 0 నుంచి 18 ఏళ్ల వయసు కలిగిన దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ చేసే నిమిత్తం గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు కుంచం నరేష్, నాగేంద్రదొర తెలిపారు. పాయకరావుపేట సమయమంతుల రెడ్డి జూనియర్ కళాశాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచీ ఈ శిబిరం నిర్వహిస్తారన్నారు. శారీరక వైకల్యం కలిగిన విద్యార్థులకు మోటరైజ్డ్ బ్యాటరీ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, రోలెటర్స్, వాకర్స్, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ కిట్స్, ఎంఆర్‌కిట్స్ ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల విద్యార్థులు శిబిరానికి వచ్చి తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. సదరం సర్టిఫికెట్, యూడీ, ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, 2 ఫొటోలు, సర్టిఫికెట్స్ నకళ్లు తీసుకుని హాజరుకావాలన్నారు. వారితోపాటు తల్లిదండ్రుల కు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఎరువుల గోదాం తనిఖీ



పీఏసీఎస్ ఎరువుల గోదామును పరిశీలించిన అధికారులు

పాయకరావుపేట: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఎరువుల గోదామును శనివారం అధికారులు తనిఖీ చేశారు. రైతులకు సరఫరా చేయడానికి దిగుమతి అయిన యూరియాను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు, వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ, తహసీల్దార్ ఎస్.మహేష్‌రావు, పీఏసీఎస్ సీఈవో పి.నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు

జిల్లా పంచాయతీ అధికారి సందీప్



దేవినగర్ కమ్యూనిటీ స్థలంలో హెచ్చరిక బోర్డులు వేయిస్తున్న డీపీవో సందీప్

ఎస్.రాయవరం: నిబంధనలు ఉల్లంఘించి వేసిన లేఅవుట్లు క్రయ, విక్రయాలకు చెల్లుబాటు కావని జిల్లా పంచాయతీ అధికారి ఇ. సందీప్ హెచ్చరించారు. తిమ్మాపురం, పెదగుమ్ములూరు గ్రామాల్లో శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్రమంగా వేసిన లే అవుట్లపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల నిర్వహణ పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణకు సూచించారు.

పంచాయతీ స్థలంలో బోర్డులు ఏర్పాటు

పాయకరావుపేట: స్థానిక పంచాయతీ పరిధిలో వేసిన లేఅవుట్‌ల్లో కమ్యూనిటీ స్థలాలను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సందీప్ తెలిపారు. పట్టణంలో 55 అనధికార లేఅవుట్లు వేశారన్నారు. వీటిలో పంచాయతీకి కేటాయించిన స్థలాల ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం డీపీవో సందీప్, నర్సీపట్నం డీఎల్‌పీవో ఎస్ఎస్ఎన్ మూర్తి దేవినగర్‌లో వేసిన లేఅవుట్‌లో పంచాయతీకి కేటాయించిన స్థలంలో బోర్డును ఏర్పాటు చేశారు. డీటీ కె.డేవిడ్, పంచాయతీ సిబ్బంది వరహాలు, శ్రీను ఉన్నారు.

మహిళలు చట్టాలు తెలుసుకోవాలి



మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సూర్యలక్ష్మి

మునగపాక : మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎస్.సూర్యలక్ష్మి కోరారు. మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం సంకల్ప కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు హైజిన్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు రుతుక్రమం సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. మహిళలు హెల్ప్‌లైన్‌ల కోసం 100, 101, 1098, 1930 వంటి సేవలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగలక్ష్మి, సీడీపీవో రమణకుమారి, హెచ్‌ఎం శంకరరావు, సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ మంజుల వాణి, మనోహర్, విశాలాక్షి, కార్యదర్శి పద్మావతి, మహిళా పోలీసులు పాల్గొన్నారు. అనంతరం కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



రవికుమార్‌ను సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

నక్కపల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న దేవవరం పాఠశాల ధవల రామకృష్ణ శాస్త్రికి శనివారం దేవవరం గ్రామస్తులు ఘనంగా సన్మానం చేశారు. విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ, వారి ఉన్నతాభివృద్ధికి కృషి చేస్తున్నారని సర్పంచ్ గొర్ల నర్సిహమూర్తి, ఉప సర్పంచ్ వేగేస్నా చంటి తెలిపారు. మాస్టారుకు అవార్డు రావడం గ్రామానికి గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వేమగిరి నూకరాజు, పూర్వ విద్యార్థులు కురందాసు నూకరాజు, కోన అప్పలరాజు, వియ్యపు వరహాలురావు, గొంప లోవరాజు, గింజలా చంద్రయ్య, కె.రమణ, ఇ.సత్తిబాబు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలో గుంటపల్లి జెడ్పీ హెచ్ స్కూల్లో పని చేస్తున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయునికి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై ప్రశంసా పత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో వ్యాయామ ఉపాధ్యాయులు రవికుమార్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. రవికుమార్ స్వగృహం నామవరంలో సన్మానించినట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు రవి, శ్యామ్, రెహమాన్, స్వామి, ప్రసాద్, లోవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు



మునగపాకలో డ్రోన్‌తో నానో యూరియా స్ప్రేయింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగపాక: నానో యూరియాతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదా యం సమకూరే నానో యూరియాను వినియోగించాలన్నారు. శనివారం మునగపాకలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో డ్రోన్ సాయంతో నానో యూరియాను స్ప్రేయింగ్ చేయడంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నానో యూరియాను వినియోగించడం ద్వారా వరి పైరు ఏపుగా పెరుగుతుందన్నారు. అన్ని రకాల పంట లకు నానో యూరియా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎకరాకు 500 మిల్లీలీటర్ల వంతున నానో యూరియాను స్ప్రే చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైతులు ఈ-పంట నమోదుపై దృష్టి సారించాలన్నారు. ఆత్మ ఏటీఎం రామకృష్ణ మాట్లాడు తూ ప్రకృతి వ్యవసాయం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఏవో జ్యోత్స్నకుమారి, వ్యవసాయ విస్తరణ అధికారులు లక్ష్మి, పద్మిని, వీఏఏ లలిత కుమారి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విల్లూరి నూక నరసింగరావు, రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్, పెద్దలు మొల్లేటి సత్యనారాయణ, ఏవీ సత్యనారాయణ, టెక్కలి పరశురామ్, ఆడారి శ్రీకాంత్, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, బీలా లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు విరాళాల వెల్లువ



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం అందజేస్తున్న రాజు



గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని పలు దేవాలయాల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. వీటికి భక్తులు తమ వంతు సాయం అందజేస్తున్నారు. మునగపాక బైపాస్ రోడ్డులో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఇదే ప్రాంతానికి చెందిన ఆడారి రాజు తనవంతు సాయంగా శనివారం రూ.2లక్షల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాద్ సర్పంచ్ దిమ్మల అప్పారావు, కమిటీ సభ్యులు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, సూరిశెట్టి రాము, వెలగా శ్రీనివాసరావు, పెంటకోట ఉమేష్, కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి లక్ష్మణరావు, పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పాటిపల్లి-మంగళవరపుపేట సరిహద్దులోని మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి యల్లపు అప్పలనరసమ్మ జ్ఞాపకార్థంగా భర్త సీతారామ్, కుమారులు హనుమంతరావు, దాలినాయుడు రూ.30,116 విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు.

వినాయకా.. సెలవిక

- నందడిగా ఊరేగింపులు..నిమజ్జనాలు
- పలుచోట్ల అన్నసమారాధనలు



యలమంచిలి రూరల్: తులసీనగర్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి



యలమంచిలి రూరల్: పెదపల్లి చెక్‌డ్యామ్ వద్ద వినాయక నిమజ్జనం



యలమంచిలి రూరల్: బయ్యవరంలో నిమజ్జనోత్సవానికి తరలివెళ్తున్న గణనాథుడు



యలమంచిలి రూరల్: పీఎన్‌ఆర్ పేట ఊరేగింపులో కోలాట ప్రదర్శన



మునగపాకలో అన్న సమారాధన చేస్తున్న దృశ్యం

యలమంచిలి రూరల్: పట్టణం, మండల వ్యాప్తంగా శనివారం గణేశ నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. 10 రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. పట్టణంలోని పెంజెరువు, పెదపల్లి శేషుగెడ్డ రిజర్వాయరు చెక్‌డ్యామ్ వద్ద, గ్రామాల చెరువుల వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు, భక్తుల కోలాహలంతో ఆధ్యాత్మికత సంతరించుకుంది. తులసీనగర్ భూలోకమాంబ ఆలయం వద్ద వినాయక మండపం వద్ద భారీ అన్న సంతర్పణను మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ప్రారంభించారు. పీఎస్‌ఆర్ పేట, బయ్యవరం గ్రామాల్లో వినాయక శోభాయాత్ర ఆకట్టుకుంది. కోలాట ప్రదర్శన, తప్పెటగుళ్లు, డీజేలతో ఊరేగింపు చేపట్టారు. నిమజ్జనోత్సవాల సందర్భంగా పలుచోట్ల అన్నదానాలు ఏర్పాటు చేశారు. పదుల సంఖ్యలో లంబోదరుని ప్రతిమలు గంగమ్మ ఒడికి చేరుకున్నాయి. ఆదివారం చంద్ర గ్రహణం ఉండడంతో వేద పండితుల సూచనతో అన్ని వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

గ్రామాల్లో నిమజ్జనాల సందడి

మునగపాక: మండల వ్యాప్తంగా శనివారం వినాయక నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. పలు చోట్ల అన్న సమారాధనలు నిర్వహించారు. మునగపాక కలోని గోవాలమ్మ సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పలువురు కళాకారులు గీతాలకు అనుగుణంగా నృత్యం చేశారు. పిల్లలు, పెద్దలు కేరింతలు కొడుతూ నిమజ్జనాలు నిర్వహించారు. మునగపాక, తిమ్మరాజుపేట, వాడ్రాపల్లి, పాటిపల్లి, నాగులాపల్లి, ఉమ్మలాడ, చూచుకొండ, గణపర్తి, సిరసపల్లి తదితర గ్రామాల్లో వినాయక నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు.

ఎస్.రాయవరం: మండలంలో కొరుప్రోలు గ్రామం గొల్లవీధిలో వరసిద్ధి వినాయకుని మండపం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. గణపతి అనుపోత్సవం పురస్కరించుకుని ఉత్సవ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.



మునగపాక: వినాయక నిమజ్జనంలో భాగంగా కోలాటం ఆడుతున్న కళాకారులు



మునగపాక: వినాయక ఊరేగింపులో భక్తులు



ఎస్.రాయవరం: గణపతి మండపం వద్ద అన్నసమారాధన చేస్తున్న దృశ్యం

భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం



పీహెచ్‌సీ రోడ్డుపై చేరిన వర్షపునీరు



నర్సీపట్నం రోడ్డు గతుకుల్లో చేరిన నీరు

ఎస్.రాయవరం: మండలంలో శనివారం కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెనుగొల్లు పీహెచ్‌సీలో రోడ్డుపై మోకాలు లోతు నీరు చేరి ఆస్పత్రికి వెళ్లే వారు అవస్థలు పడ్డారు. ఈ రోడ్డుకిరువైపులా ఉన్నవారు డ్రైనేజీ కాలువ లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం, ఇటీవల పీహెచ్‌సీ ప్రాంగణంలో మట్టితో ఎత్తు, పల్లాలు చదును చేయడంతో నీరు దిగువకు వెళ్లకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. ఈ సమస్యను పంచాయతీ, పీహెచ్‌సీ సిబ్బందికి తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రోడ్డు ఇలాఉంటే రోగులు, గర్భిణులు ఎలా రాకపోకలు చేస్తారని వాపోతున్నారు. ఇదిలావుంటే నర్సీపట్నం రోడ్డు దార్లపూడి సమీపంలో కొండ గెడ్డనీరు నేరుగా రోడ్డుపై మళ్లించడంతో రెండు కిలోమీటర్లు మేర పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఘనంగా గురుపూజోత్సవం



గురుపూజోత్సవంలో ఉపాధ్యాయులు

కోటవురట్ల: కొడవటిపూడి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం ఆర్.ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యలమంచిలి ప్రకాష్, మాజీ సర్పంచ్ బాలేపల్లి సత్యనారాయణ, విద్యా కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.